సాక్షి
విజయనగరం

సోమవారం | 13 | మే | 2024



వైఎస్సార్ పంటల బీమాతో.. రైతన్నకు ధీమా - 8లో

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతన్నకు అండగా నిలిచింది. పంటల బీమాతో ఆదుకుంది.



కచ్చితమైన నివేదికలివ్వాలి..

పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలను కచ్చితమైన వివరాలతో వేగంగా అందజేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. - 8లో



దోచుకోవడమే వారికి తెలుసు..

టీడీపీ హయాంలో పనికి ఆహార పథకం, నీరు–చెట్టు పనుల్లో కోట్లాది రూపాయల ప్రజాధనం దోచుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేడే పోలింగ్

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఉదయం 5.30కే మాక్ పోలింగ్
- జిల్లా వ్యాప్తంగా 1,847 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 15,62,921 మంది ఓటర్లు
- పీఓ, ఏపీఓ, ఓపీఓలు 13,661 మంది
- 11 మోడల్ పోలింగ్ కేంద్రాల నిర్వహణ
- 226 రూట్లు.. 385 బస్సుల వినియోగం

విజయనగరం అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం. లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులను ఎన్నుకునే ఓటింగ్ ప్రక్రియకు సమయం ఆసన్నమైంది.



ఎన్నికల సామగ్రిని చెక్ చేసుకుంటున్న సిబ్బంది

జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓ పౌరుడా.. ఆలోచించు.. మనకు ఎవరు మంచి చేశారో.. చెప్పిన హామీలను ఎవరు మాట తప్పకుండా నెరవేరుస్తారో.. మన భవిష్యత్తుకు ఎవరు బాటలేస్తారో విజ్ఞతతో యోచించి ఓటు వేయు! నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజాసేవకు తపిస్తూ నిబద్ధత ఉండే నాయకుడి కోసం అన్వేషించు. నీ ఒక్క ఓటు నీ ఊరి గతిని.. నీ జిల్లా రూపురేఖల్ని మారుస్తుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకో. ఈ రాష్ట్ర భవిష్యత్తును బాగుచేస్తుంది. పద.. పోలింగ్ బూత్‌కు... నీ ఆయుధంతో సుపరిపాలనకు ఓటెయ్! విశ్వసనీయతకు పట్టం కట్టు!

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్

జిల్లాలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి పోలింగ్ ఏర్పాట్లను తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక పర్యవేక్షించారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో ఉదయం 5.30 గంటలకే అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహిస్తారు.

1,847 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లోని 15,62,921 మంది ఓటర్ల ఓటింగ్ కోసం 1,847 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అసెంబ్లీలకు 77 మంది, పార్లమెంట్ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మొత్తం ఓట్లలో 7,70,805 మంది పురుషులు, 7,92,038 మంది మహిళలు, 78 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు సామగ్రి రవాణా కోసం 226 రూట్లుగా విభజించారు. 226 సెక్టార్ అధికారులు పర్యవేక్షిస్తారు. అదనంగా 20 మంది రిజర్వులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 15,62,921 ఓటర్లలో 18,869 పోస్టల్ ఓటింగ్ పూర్తయింది.

11 మోడల్ పోలింగ్ కేంద్రాలు

ఓటర్లలో స్ఫూర్తి నింపేందుకు జిల్లాలో 11 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, అదనపు హంగులు కల్పించారు.

2,290 మంది పీఓలు

జిల్లాలోని 1,847 పోలింగ్ కేంద్రాలకు రిజర్వు సిబ్బందితో కలిపి 2,290 మంది ప్రిసైడింగ్ అధికారులు, మరో 2,306 మంది ఏపీఓలు, 9,065 మంది అదనపు పోలింగ్ అధికారులు కలిపి 13,661 మందిని నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక పీఓతో పాటు ఐదుగురు సిబ్బంది ఉండేలా ఏర్పాటు చేశారు. ఇంకా 225 మంది సెక్టార్ అధికారులు, 445 మంది మైక్రో అబ్జర్వర్లు, 1,847 మంది బీఎల్‌ఓలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో సుమారు 728 మంది సిబ్బంది, 362 మంది వీడియో గ్రాఫర్లు ఎన్నికలను నిర్వహిస్తున్నారు. వీరు కాకుండా డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది, హమాలీలు వందల మంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధంగా జిల్లాలోని 1,847 పోలింగ్ కేంద్రాల్లోనూ తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ లైటింగ్, ర్యాంపులు, ఫర్నీచర్, టెంట్లు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి



ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకుంటున్న యువత అంతా తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. జిల్లాలో జరగనున్న ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాలను, ఎన్నికల సూక్ష్మ పరిశీలకులను, వీడియోగ్రాఫర్లను నియమించి సాఫీగా జరగడానికి పూర్తి ఏర్పాట్లు చేశాం.

– నాగలక్ష్మి, జిల్లా ఎన్నికల అధికారి

జగన్ పాలన ఐదేళ్లూ...
జన సంక్షేమం





విజయనగరం రూరల్ మండలంలోని గుంకలాం గ్రామంలోనున్న జెడ్పీ హైస్కూల్ ఇది. ఇప్పుడే కాదు 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ పోలింగ్ కేంద్రం కూడా. అప్పుడు పోలింగ్ విధులకు వెళ్లడానికి సిబ్బంది వెనుకాడే పరిస్థితి. కారణం స్కూల్ బిల్డింగ్ సరిగాలేదు. ఉన్న మరుగుదొడ్లు నిర్వహణ లేక, రన్నింగ్ వాటర్ లేక అడుగుపెట్టడానికే భయపడే పరిస్థితి. ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన 'నాడు–నేడు' కార్యక్రమంతో ఆ పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. రన్నింగ్ వాటర్ సౌకర్యంతో అత్యాధునిక మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. పోలింగ్ నిర్వహణ ఇప్పుడు నల్లేరుపై నడకే! విద్యుత్తు, ఇంటర్‌నెట్ సదుపాయాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సిబ్బంది చక్కగా పనిచేసుకోవచ్చు. ఇలా జిల్లాలోని స్కూళ్లల్లో ఏర్పాటుచేసిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో చక్కటి సౌకర్యాలు సమకూరాయి. ప్రతి గ్రామంలో 'నాడు–నేడు'తో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలతో పాటు వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం, సచివాలయం కూడా సమకూరాయి. వాటివల్ల ఎలాంటి ప్రయోజనాలు పొందుతున్నామో అక్కడి ప్రజలకే తెలుసు! టీడీపీ నాయకుల ప్రలోభాలకు లోనుగాకుండా 'పచ్చ' కళ్లద్దాలను కాసేపు పక్కన బెట్టి కళ్లు తెరచి చూస్తే గ్రామ స్వరాజ్యం కనిపిస్తుంది. ఇలాంటి అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని సంస్కరణ వాదులు కోరుకుంటున్నారు. ఇంకెందుకు ఆలస్యం... 'ఫ్యాన్' గుర్తుకు ఓటేస్తే మళ్లీ ఆ సంక్షేమ రాజ్యం వస్తుందని ప్రజలు భావిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచే ఓటేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

మా ఊరే మారిపోయింది...



చిన్నప్పుడు నేను గుంకలాం పాఠశాలలోనే చదువుకున్నాను. ఐదేళ్ల క్రితం వరకూ చిన్న భవనాలే దిక్కు. ఐదేళ్లలో విశాల భవనాలు నిర్మించారు. మౌలిక వసతులు పెరిగాయి. పిల్లలకు బెంచీలు, ట్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు... అన్నీ సమకూర్చడం బాగుంది. రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు మంచి సౌకర్యం. దీనివల్ల విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ఇదేగాక ఆర్‌బీకే, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌తో మా ఊరే మారిపోయింది.

– బలగం స్వామినాయుడు, షిప్‌యార్డు కాంట్రాక్టర్, విశాఖపట్నం

సకల సౌకర్యాలతో 'నాడు–నేడు' ప్రభుత్వ పాఠశాలలు...

తొలి విడతలో ఆధునీకీకరించినవి	841
ప్రభుత్వం వెచ్చించిన నిధులు	రూ.217 కోట్లు
రెండో విడతలో ఎంపికైన స్కూళ్లు, అంగన్‌వాడీలు, జూనియర్ కాలేజీలు	738
ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు	రూ.232 కోట్లు

- జనం ఖాతాల్లోకి నేరుగా రూ.18,591 కోట్లు జమ
- గతమెన్నడూ లేనివిధంగా జిల్లాలో అభివృద్ధి పరుగు
- 'నాడు–నేడు'తో బాగుపడిన బడులు, ఆస్పత్రులు
- రైతుభరోసా కేంద్రాలతో రైతుల అష్టకష్టాలకు చెక్
- సచివాలయ వ్యవస్థతో మారిన ప్రభుత్వ సేవల చిత్రం
- వృద్ధులు, దివ్యాంగుల సహా ప్రజలకు వలంటీర్ల సేవలు
- మారుమూల పల్లెలకూ చేరిన ప్రభుత్వ వైద్యం
- సిద్ధమవుతోన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ సాకారం
- మన్యానికి మకుటంలా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ఒకప్పుడు వలసలకు, వెనుకబాటుతనానికి విజయనగరం జిల్లా నిలువెత్తు సాక్ష్యం. దశాబ్దాల పాటు టీడీపీ నాయకులను భుజాలపై మోసిన ప్రజలకు కాళ్లపీకులు తప్ప కష్టాలు తీరలేదు. ఇళ్ల దగ్గర పిల్లలను, వృద్ధులను వదిలిపెట్టి పొట్టచేతపట్టుకొని హైదరాబాద్, చెన్నై ఇలా ఉపాధి ఎక్కడ దొరికితే అక్కడికి మూటముల్లె సర్దుకొని వెళ్లిపోవడమే కనిపించేది. అలాంటి ఈ ప్రాంత దశాదిశా మారిపోతోంది. ఎక్కడి నుంచో ఇక్కడికే వలసలు వచ్చేలా భవిష్యత్తు కనిపిస్తోంది. 'నాడు–నేడు'తో గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారాయి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు నుంచి చేతికొచ్చిన పంట అమ్ముకోవడం వరకూ గత టీడీపీ పాలనలో రైతులు పడిన అష్టకష్టాలన్నీ రైతుభరోసా కేంద్రాలతో తీరిపోయాయి. రాష్ట్రానికి పరిపాలనా రాజధాని కానున్న విశాఖనగరానికి చేరువగా ఉండటం, భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయ పనులు శరవేగంగా జరగడం, మరోవైపు విశాఖపట్నం–రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తికావడం విజయనగరానికి వరంలా మారాయి. అంతేకాదు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నడుంబిగించి విజయవంతంగా పూర్తి చేసిన జిల్లాల పునర్విభజనతో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే ఎంతో ప్రాధాన్యం ఉన్న జిల్లాగా రూపుదాల్చింది. రూ.500 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, 519 ఎకరాల సువిశాల సుందర ప్రదేశంలో నిర్మిస్తున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, విశ్వవిద్యాలయంగా మారిన జేఎన్‌టీయూ–జీవీ... ఇవన్నీ విజయనగరం జిల్లాకు కలికితురాయి కానున్నాయి.



● ఎయిర్‌పోర్టు శరవేగంగా పూర్తి అవ్వాలంటే...

రైతులకు పరిహారం, నిర్వాసితులకు పునరావాసం కల్పించి, కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులన్నీ తీసుకున్న తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది మే 3వ తేదీన భోగాపురం వద్ద అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రైవేట్ ఎయిర్‌పోర్టు కంపెనీల్లో ఒకటైన జీఎంఆర్ గ్రూప్ పీపీపీ విధానంలో ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని చేపట్టింది. ముఖ్యమంత్రి ఆశించినట్లు 2025 నాటికి మొదటి దశ పూర్తి చేయాలనే లక్ష్యంతో ల్యాండ్ ఫిల్లింగ్, రన్‌వే, టెర్మినల్ నిర్మాణ పనులను ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించింది. ఈ పనులన్నీ శరవేగంగా పూర్తి కావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు. ఎందుకంటే ఏడాదికి 4 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యం దీని సొంతం. మన రాష్ట్రం నుంచి దేశీయ, విదేశీ విమానయానం మరింత ఊపందుకుంటుంది. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ కార్గో టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే ఉత్తరాంధ్రలో ఉన్న ఫార్మా తదితర పరిశ్రమల విస్తరణకు, ఎగుమతుల ప్రోత్సాహకానికి ఉపయోగపడుతుంది. వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. విశాఖపట్నం పోర్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకూ ప్రభుత్వ పరిశీలనలోనున్న భీమిలి బీచ్ కారిడార్ కార్యరూపం దాల్చితే ఈ ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ నెట్‌వర్క్ పెరగడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం ఏర్పడుతుంది. విమానాశ్రయంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆరు లక్షల మందికి ఉపాధి కలుగుతుంది.



అందంగా ముస్తాబైన నెల్లిమర్ల మండలంలోని మెండేవీధి పాఠశాల



సీసీ రోడ్ల ఏర్పాటు ఇలా...

● గంగపుత్రులకు వరం ఫిషింగ్ జెట్టీ...

కడలిని నమ్ముకున్న గంగపుత్రులకు ఫిషింగ్ జెట్టీ అనే వరాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారు. పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో నిర్మాణానికి గత ఏడాది మే 3వ తేదీన భూమిపూజ చేశారు. టెండర్ల దశలో ఉన్న ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మత్స్యకారులు కోరుకుంటున్నారు.

- జెట్టీ నిర్మాణానికి అంచనా వ్యయం: రూ.23.74 కోట్లు
- ప్రభుత్వం కేటాయించిన నిధులు: రూ.25 కోట్లు
- నిర్మాణానికి కేటాయించిన భూమి: 6ఎకరాలు
- జెట్టీ వల్ల 5,053 మత్స్యకార కుటుంబాలకు ప్రత్యక్షంగా, మరో 4వేల కుటుంబాలకు పరోక్షంగా ప్రయోజనం
- 417 సంప్రదాయ పడవలకు, 711 మోటరైజ్డ్ బోట్లకు భద్రంగా లంగర్ వేసుకొనే సౌలభ్యం



● ప్రాణం నిలబెట్టినవారిని మరచిపోతామా?

యావత్ ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మనల్ని రెండేళ్ల పాటు ముప్పతిప్పలు పెట్టింది. అలాంటి భయంకరమైన పరిస్థితుల్లో ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలబడింది. గ్రామ స్థాయిలో వైద్య పరీక్షలు, కరోనా లక్షణాలున్నవారిని గుర్తించి క్వారంటైన్ సెంటర్లలో వసతి, సమస్య ఎక్కువైనవారికి ప్రతి ఆస్పత్రిలో వైద్యసేవలు అందించడమే గాక కోలుకున్న తర్వాత రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకూ ఆర్థిక సాయం అందించి మళ్లీ ఇంటికి క్షేమంగా పంపించిన ఘనత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఇక విజయనగరం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసింది, భవనాల నిర్మాణం శరవేగంగా పూర్తిచేసి గత ఏడాది సెప్టెంబర్ 15న ప్రారంభించినదీ ఆయనే! దీంతో ప్రజలు అత్యవసర వైద్యానికి, సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణుల సేవలకు విశాఖపట్నం వరకూ పరుగులుపెట్టాల్సిన పరిస్థితి తప్పింది. ఇప్పుడు 24 గంటలూ ఆ సేవలు విజయనగరంలోనే అందుబాటులోకి వచ్చాయి.


వైద్యకళాశాల విస్తీర్ణం: 70 ఎకరాలు (గాజులరేగ సర్వే నెం. 1/89)
భవనాల నిర్మిత ప్రాంతం : 13,99,879 చదరపు అడుగులు
తొలి దశలో పూర్తి చేసిన విస్తీర్ణం : 1.50 లక్షల చదరపు అడుగులు
నిర్మాణ వ్యయం : రూ.500 కోట్లు
బోధనానుపత్రి విస్తీర్ణం: 6,61,954 చదరపు అడుగులు
సర్వీసు బ్లాక్: 26,376 చదరపు అడుగులు
అందుబాటులోనున్న బెడ్స్ : 500
ఎంబీబీఎస్ సీట్లు : 150
బోధన, బోధనేతర సిబ్బంది : 222

● 'గిరి'జన చెంతన విద్యాదీపం....

ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ) సొంత భవనాల నిర్మాణ పనులకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది ఆగస్టు 25న భూమిపూజ చేశారు. గిరిజన ప్రాంతానికి చేరువగా, గిరిజన ప్రగతికి దిక్సూచిగా సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి, విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల సరిహద్దులో దీన్ని నిర్మిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 2014 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి మంజూరు చేసిన ఈ కేంద్రీయ విద్యాసంస్థ కోసం 2019 ఏప్రిల్ వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం ఏమీ చేయలేక చేతులెత్తేసింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్ భవనంలో 2019 ఆగస్టు 5న సీటీయూఏపీ తరగతులు ప్రారంభమయ్యాయి.

- సీటీయూఏపీ కోసం ఏపీ బడ్జెట్‌లో కేటాయింపు: రూ.834.83 కోట్లు
- కేటాయించిన భూమి: 519.03 ఎకరాలు
- నిర్మాణం పూర్తి చేయడానికి లక్ష్యం: 42 నెలలు
- మౌలిక వసతుల కల్పనకు కేటాయింపు: రూ. 23.60 కోట్లు

సంక్షేమంలో మేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



● పేదలందరికీ ఇళ్లు...
మొత్తం మంజూరైన ఇళ్లు: 78,429
నిర్మాణం పూర్తి అయినవి: 38,161

● గడప గడపకు మన ప్రభుత్వంలో పనులు
ప్రతిపాదిత పనులు : 3,208
అంచనా వ్యయం: రూ.101.12 కోట్లు
పూర్తి అయినవి: 773
పురోగతిలో ఉన్నవి: 1,670

● ప్రాధాన్యతా భవనాల నిర్మాణం



గ్రామ సచివాలయాలు: 530
రైతుభరోసా కేంద్రాలు: 496
వైఎస్సార్ హెల్త్ సెంటర్లు: 435
డిజిటల్ లైబ్రరీలు: 173
బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు: 50

● ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యం...
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 50
అందుబాటులోనున్న వైద్యులు: 117
యూపీహెచ్‌సీలు: 18
అందుబాటులోనున్న వైద్యులు: 15
సీహెచ్‌సీలు: 5
108 వాహనాలు: 28
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు: 22
104 వాహనాలు: 47
ఏఎన్ఎంలు: 640
బర్త్ వెయిటింగ్ హోమ్స్: 4
జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు: 541
ప్రయోజనం పొందినవారు: 2,53,679



నవరత్నాలతో నేరుగా లబ్ధి
రూ.18,591.32 కోట్లు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థిక ప్రయోజనం
డ్వాక్రా బ్యాంకు లింకేజీ రుణాలు	4,75,032	రూ.6,319.07 కోట్లు
వైఎస్సార్ పెంఛన్ కానుక	2,82,748	రూ.4,523.39 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	2,63,394	రూ.1,879.19 కోట్లు
జగనన్న అమ్మ ఒడి	6,76,226	రూ.1,263.61 కోట్లు
స్త్రీనిధి	43,243	రూ.825.71 కోట్లు
వైఎస్సార్ ఆసరా	4,20,619	రూ.754.05 కోట్లు
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	2,53,720	రూ.587.49 కోట్లు
వైఎస్సార్ చేయూత	1,77,530	రూ.534.19 కోట్లు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,16,198	రూ.501.97 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ	4,59,359	రూ.209.32 కోట్లు
జగనన్న విద్యాకానుక	1,73,364	రూ.156.48 కోట్లు
జగనన్న గోరుముద్ద	7,30,017	రూ.142.44 కోట్లు
వైఎస్సార్ చేయూత (జగనన్న పాలవెల్లువ)	18,855	రూ.141.41 కోట్లు
జగనన్న తోడు	1,11,345	రూ.127.48 కోట్లు
జగనన్న చేదోడు	17,245	రూ.97.97 కోట్లు
వైఎస్సార్ బీమా	4,846	రూ.80.87 కోట్లు
వైఎస్సార్ వాహనమిత్ర	63,044	రూ.77.765 కోట్లు
జగనన్న విద్యాదీవెన	17,996	రూ.74.81 కోట్లు
వైఎస్సార్ కాపునేస్తం	5,905	రూ.41.52 కోట్లు
ఉన్నతి (ఎస్‌సీఎస్‌పీ అండ్ టీఎస్‌పీ)	7,172	రూ.36.745 కోట్లు
డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా	37,497	రూ.33.08 కోట్లు
వైఎస్సార్ పశునష్ట పరిహార పథకం	6,435	రూ.29.87 కోట్లు
వైఎస్సార్ చేయూత (జగనన్న జీవక్రాంతి)	3,489	రూ.26.17 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	5,738	రూ.24.77 కోట్లు
వైఎస్సార్ యంత్రసేవ	2,550	రూ.18.88 కోట్లు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	14,218	రూ.17.72 కోట్లు
సున్నా వడ్డీ పంటరుణాలు	1,14,999	రూ.17.13 కోట్లు
జగనన్న వసతిదీవెన	15,897	రూ.12.90 కోట్లు
పాస్టర్లకు గౌరవ భృతి	142	రూ.8.20 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	754	రూ.6.80 కోట్లు
టీఎంఆర్ (పశుగ్రాసం పంపిణీ)	14,798	రూ.5.04 కోట్లు
ఇమామ్‌లకు గౌరవభృతి	94	రూ.4.64 కోట్లు
జగనన్న తోడు (వడ్డీ మాఫీ)	1,11,636	రూ.2.66 కోట్లు
జననీసురక్ష యోజన	18,899	రూ.2.26 కోట్లు
హెచ్ఎస్‌డీ ఆయిల్ సబ్సిడీ	1,634	రూ.1.814 కోట్లు
వైఎస్సార్ పశు బీమా	8,826	రూ.1.47 కోట్లు
గడ్డి విత్తనాల పంపిణీ	16,907	రూ.0.89 కోట్లు
మత్స్యకారులకు ఎక్స్‌గ్రేషియా	8	రూ.0.50 కోట్లు
పశుగ్రాస కత్తిరింపు యంత్రాలు	112	రూ.0.386 కోట్లు

క్లుప్తంగా

మద్యంతో పట్టుబడిన టీడీపీ కార్యకర్త



పట్టుబడిన మద్యం సీసాలతో సీఐ సురేష్, సిబ్బంది

భోగాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచేందుకు తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు ఆదివారం మద్యం సీసాలు పంపిణీ చేశారు. మండలంలోని సవరవిల్లిలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన 45 మద్యం సీసాలతో టీడీపీ కార్యకర్త బర్ల గురుమూర్తి పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.సురేష్ తెలిపారు.

1032 మద్యం బాటిళ్లు..



రాజాం సిటీ: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిపిన దాడుల్లో 1032 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. సంతకవిటి మండలం తాలాడ సమీపంలో 574 మద్యం బాటిళ్లు.. వంగర మండలం అరసాడ సమీపంలో 76.. రేగిడి మండలం బూరాడ సమీపంలో 380 బాటిళ్లు పట్టుకున్నామన్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహిత ఆత్మహత్య

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామం యాతపేటకు చెందిన ఎర్ర చిన్న (33) ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం. మృతురాలికి భర్త రాముతో ఎప్పటికప్పుడు తగదాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన చిన్న ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినశిర్లాంలో వ్యక్తి హత్య





హత్యకు గురైన సంగం (ఇన్‌సెట్లో) సంగం (ఫైల్)

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాతత ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చిన్నశిర్లాం దళితవాడలో నివాసం ఉంటున్న ఉత్తరావల్లి సంగం (65) తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు నిద్రిస్తున్న సంగం గొంతును కత్తితో కోశారు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య నక్షత్రమ్మ, కుమారులు కిషోర్, కిరణ్ ఉన్నారు. సంఘటనా స్థలానికి చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, ఎస్సై ఇ.శ్రీనివాస్ చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ హత్యకు రాజకీయానికి ఎటువంటి సంబంధం లేదని పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రశాంతంగా ఎన్నికలు..



పోలింగ్ కేంద్రాల వివరాలపై ఆరాతీస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటింగ్ జరిగేలా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలు, రూట్‌ల వివరాలను ఆర్‌వో ఎల్.జోసెఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లోని సదుపాయాలపై ఆరాతీశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

వైఎస్సార్ పంటల బీమాతో..
రైతన్నకు ధీమా



- ఐదేళ్ల కాలంలో 37,487 మంది రైతులకు రూ.33.08 కోట్ల చెల్లింపు
- పంట నష్టం జరిగిన వెంటనే బీమా చెల్లింపు
- రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం



విజయనగరం ఫోర్ట్: పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఇజ్జాడ హనుమంతురావు. ఇతనిది బొండపల్లి మండలం జె. గుమడాం రెవెన్యూ పరిధిలోని కొవ్వాడపేట గ్రామం. 2021 ఖరీఫ్‌లో రెండెకరాల వరకు అరటిపంట సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా అరటిపంట దెబ్బతింది. దీంతో ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా పథకం కింద ఇతని బ్యాంక్ ఖాతాలో రూ.27,100 ప్రభుత్వం జమ చేసింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కొవ్వాడ కొండలరావు. ఇతనిది బొండపల్లి మండలం కొవ్వాడ పేట గ్రామం. 2021 ఖరీఫ్‌లో ఎకరం పొలంలో అరటి పంట సాగు చేసాడు. వర్షాభావ పరిస్థితుల వల్ల అరటిపంట దెబ్బతింది. దీంతో వైఎస్సార్ పంటల బీమా కింద అతని ఖాతాలో రూ. 14,577 జమైంది.

2019 నుంచి 2022 వరకు ప్రభుత్వం చెల్లించిన పంటల బీమా వివరాలు

సంవత్సరం	రైతులు	పంటలబీమా మొత్తం రూ. కోట్లలలో
2019	3,183	రూ.2,52,62,329
2020	24,625	రూ.20,68,99,051
2021	9,361	రూ.9,36,49,299
2022	324	రూ.50,14,290

అనుకోని విపత్తుల కారణంగా పంట నష్టపోతున్న రైతులను వైఎస్సార్ పంటలబీమా పథకం అదుకుంటోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రకృతి వైపరిత్యాలు పెద్దగా సంభవించలేదు. ఒకటి రెండు చోట్ల ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టం జరిగినా వాటికి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సాగు పెట్టుబడి కోసం వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా ఏటా రూ. 13,500 సాయాన్ని అందిస్తోంది. అదేవిధంగా రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే అందజేస్తోంది. అదేవిధంగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట నష్టపోయిన రైతులను అదుకోవడం కోసం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ పంట బీమా పథకాన్ని అమలు చేస్తోంది.

ఉచిత బీమా..

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. బీమాకు చెల్లించాల్సిన ప్రీమియం సొమ్మును కూడా రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇందుకు గాను ఏటా రూ. 13 కోట్లు వెచ్చిస్తోంది. పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు పథకానికి అర్హత ఉన్నట్లే.

రూ. 33.08 కోట్లు చెల్లింపు..

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు పంట నష్టపోయిన 37,497 మంది రైతులకు రూ.33.08 కోట్లు పంటల బీమా పథకం కింద ప్రభుత్వం చెల్లించింది. వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలకు ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా అమలు చేస్తోంది. జిల్లాలో వరి పంట 93 వేల హెక్టార్ల లోను, మొక్కజొన్న 15 వేల హెక్టార్లలోను, ఉద్యానవన పంటలు 60 వేల హెక్టార్లలో సాగవుతున్నాయి.

గతంలో రైతులే చెల్లించేవారు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాము సాగు చేసిన పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించేవారు. ఒక్కో రైతు రూ.2 వేల నుంచి 4 వేల రూపాయల వరకు రైతులే చెల్లించేవారు. ఇది అదనపు భారమే అయినా గత్యంతరం లేక రైతులే చెల్లించేవారు. కాని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క పైసా తీసుకోకుండా ప్రభుత్వమే చెల్లిస్తోంది.

పీడీఎంఎస్ యాప్‌లో పోలింగ్ శాతం నమోదు

విజయనగరం అర్బన్: సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం సేకరించేందుకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోల్ డే మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే యాప్‌లో పోలింగ్ శాతం నమోదు చేస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి పీఓలు, సెక్టార్ అధికారులు ఈ యాప్‌లో పోలింగ్ వివరాలు నమోదు చేస్తారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గాల నుంచి వివరాలు సేకరించేందుకు 35 మంది సచివాలయ సిబ్బందిని నియమించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఈఈ బంగారునాయుడు పీడీఎంఎస్ విభాగంలో పోలింగ్ నమోదును పర్యవేక్షిస్తారు.

కచ్చితమైన నివేదికలివ్వాలి..



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలను కచ్చితమైన వివరాలతో వేగంగా అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ఎన్నిక రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ'పై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద ఎలా ఓటు చేయాలి, తదితర వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలు ఎంతో కీలకమని, కచ్చితమైన సమాచారంతో అందజేయాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతాన్ని తీసుకోవాలని.. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఈ వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ అనిత, ఎన్నికల రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఇన్‌చార్జ్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది

వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించిన కలెక్టర్


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదివారం రాత్రి పరిశీలించారు. జిల్లాలోని 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో సహా మొత్తం 1,136 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీని కోసం 2,272 సీసీ కెమేరాలను అమర్చారు. వీటి ద్వారా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచే పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ ఆదివారం సాయత్రానికే ప్రారంభమైంది.

పోలింగ్ స్టేషనరీ రంగుపై గందరగోళం



ఎన్నికల సిబ్బందికి అందించిన పసుపు రంగు ఐడీ కార్డు

- పసుపు రంగు పేపర్లపై ఐడీ కార్డుల ముద్రణ
- విస్మయం వ్యక్తం చేసిన సిబ్బంది



పసుపు రంగు పేపర్‌పై ముద్రించిన ఎన్నికల స్టేషనరి

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి అందించిన స్టేషనరీ, ఐడీ కార్డులపై గందరగోళం నెలకొంది. స్టేషనరీ సామాన్లు వివిధ పార్టీల జెండాలు, ఆ పార్టీ రంగులను పోలినవి కాకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంటుంది. అయితే ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి అందించిన ఐడీ కార్డులు, స్టేషనరీని పసుపు రంగు పేపర్లపై ముద్రించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే సిబ్బందికి పసుపు రంగుతో కూడిన ఐడీలను అందించడంతో అధికారుల తీరుపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముచ్చర్లవలస గ్రామానికి చెందిన బొడ్డు జగన్ మోహనరావు(48) ఆరికతోట నుంచి తన ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వస్తుండగా.. ఆరికతోట వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. దీంతో జగన్ మోహనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై జ్ఞానప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు

- సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మొహర్డా



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్డా

పార్వతీపురం: సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మొహర్డా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురంలోని డా. వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామగ్రి స్వీకరణ రిసెప్షన్ కేంద్రానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజక వర్గాలకు వేరువేరుగా కేటాయించిన శిబిరాలలోని కౌంటర్ల వద్ద టేబుల్స్, కుర్చీల ఏర్పాటును, పోలింగ్ అనంతరం పీఓలు, ఏపీఓల స్క్రూటినీ, స్వీకరణకు కల్పించిన వసతులు, తదితర అంశాల ఏర్పాట్లపై కలెక్టర్ ఆయనకు వివరించారు. అలాగే లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడ్లు, గోడలకు మెస్ ఏర్పాటును నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బందికి ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల సామగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గాలి, వెలుతురు, తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. టాయిలెట్స్ నిర్మాణాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రతా, ఓట్ల లెక్కింపు కేంద్రాలవద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా, పర్యవేక్షణ కోసం వసతి కల్పన చూశారు.

బస్‌ల రాకపోకలకు అంతరాయం లేకుండా..

స్ట్రాంగ్ రూమ్ వద్దకు సులువుగా చేరుకునేలా రాకపోకలకు అంతరాయం కలగకుండా కళాశాల ముందు భాగంలో బస్‌ల పార్కింగ్‌కు అనువుగా స్థలాన్ని సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఆయనకు తెలిపారు. బస్సులు నడిపేందుకు ఎక్కడా ఇబ్బంది లేకుండా రిసెప్షన్ కేంద్రానికి వచ్చేందుకు, వెళ్లేందుకు మార్గాలను సూచించినట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన ఎన్నికలకు కేటాయించి న ప్రతి విభాగాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్. శోభిక, కంట్రోల్ రూమ్ ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారి పి.త్రినాథ రావు, డీపీహెచ్ఈఓ కేజీఎన్.నరసింగరావు, రోడ్లు భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాల్ రావు, పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోచుకోవడమే వారికి తెలుసు..

- నీరు – చెట్టు, సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల కాంట్రాక్ట్‌లు టీడీపీ కార్యకర్తలకే
- ఇంకుడు గుంతలు, నాడెప్ కుండీల నిర్మాణాల్లోనూ చేతివాటం
- రూ. కోట్లు వెనకేసుకున్న టీడీపీ నేతలు



నీరు - చెట్టు పనుల్లో అరకోటికి పైగా అవినీతి జరిగిన రాకోడు వెంకునాయుడు చెరువు (ఫైల్)

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న కాలంలో (2004 ముందు వరకు) పనికి ఆహార పథకంలో పందికొక్కులా నిధులు మింగేసిన ఆ పార్టీ నేతలు 2014 – 2019 మధ్య కాలంలో మరోసారి అధికారం రావడంతో నీరు – చెట్టు పనుల్లో కోట్లాది రూపాయలు వేనకేసుకున్నారు. తెలుగు తమ్ముళ్లకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా న్యాయం చేయాలని భావించిన చంద్రబాబునాయుడు తన పాలనా కాలంలో సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాల ద్వారా వారికి లబ్ధి చేకూర్చే పనులనే అప్పగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిధులను మింగేయడానికి జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. దీంతో ఐదేళ్ల టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజల రక్తాన్ని పీల్చేశాయి. మరోసారి వారికి అధికారం అప్పగిస్తే జన్మభూమి కమిటీలకు మించి ప్రజలను మింగేయడానికి సిద్ధమైపోతారని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జిత్తులమారి చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేమని ప్రజలు చెబుతున్నారు.

నీరు – చెట్టు పనుల్లో దోచేశారిలా...

విజయనగరం నియోజకవర్గంలో 2014–15 సంవత్సరం నుంచి నీరు – చెట్టు కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించిన తెలుగుదేశం ప్రభుత్వం నియోజకవర్గంలోనే చేయని పనులకు కోట్లాది రూపాయలను మింగేసింది. దీంతో పాటు చెరువుల్లో మట్టిని తవ్వి అమ్ముకొని లక్షలాది రూపాయలను దోచేశారు.

మట్టితో వ్యాపారం

చెరువుల్లో మట్టిని తీసి రైతుల పొలాలకు తరలించడానికి క్యూబిక్ మీటరుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 29 లు చెల్లించగా.. చెరువు గట్లు పటిష్టానికి, శ్మశానవాటికలు, ప్రభుత్వ కార్యాలయాలకు తరలించడానికి క్యూబిక్ మీటర్‌కు రూ. 82.80 చెల్లించింది. అయితే టీడీపీ నాయకులు ప్రభుత్వ ఖర్చుతో తీసిన మట్టిని రియల్ ఎస్టేట్ స్థలాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒక్కో లారీ లోడుకు రూ. 400 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేశారు. 2015 నుంచి 2019 మధ్య కాలంలో నీరు – చెట్టు పనులు 145 చేయగా రూ. 9.40 కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. వీటిలో చేసిన 63 పనులనే మళ్లీ చేసినట్లు చూపి కోట్ల రూపాయల నిధులను తెలుగుదేశం పార్టీ నేతలు దోచేశారు.



రియల్ ఎస్టేట్ భూముల్లో నీరు- చెట్టు పథకంలోని చెరువు మట్టి (ఫైల్)

నాడెప్ కుండీల నిధులు టీడీపీ నేతల జేబుల్లోకి..

విజయనగరం మండల పరిధిలో 2016 – 17 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించేందుకు 941 వర్మీ నాడెప్ యూనిట్లకు రూ. 1.04 కోట్లతో ప్రతిపాదనలు చేయగా నాటి టీడీపీ ప్రభుత్వం 894 యూనిట్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి రూ. 99.84 లక్షలు కేటాయించింది. అయితే వీటిలో సగం పనులు చేయగా, అవి కూడా నాసిరకంగా నిర్మించడంతో ఆ నిధులు టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల జేబుల్లోకే వెళ్లిపోయాయి.

తెలుగు తమ్ముళ్లకు కమీషన్లు..

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకంలో మండల వ్యాప్తంగా 5,645 మరుగుదొడ్ల నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 8.46 కోట్లు మంజూరు చేసింది. అయితే మరుగుదొడ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో తెలుగు తమ్ముళ్లు అందినకాడికి దోచుకున్నారు. అలాగే నిర్మాణాలు చేపట్టిన వారి నుంచి కమీషన్లు వసూలు చేశారు.



నాసిరకంగా నిర్మించిన వదిలేసిన నాపెడ్ కుండీ(ఫైల్)



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నాసిరకంగా నిర్మించిన మరుగుదొడ్లు(ఫైల్)

ఇంకుడు గుంతల నిర్మాణాల్లోనూ చేతివాటం..

2015 – 16లో నాటి టీడీపీ ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలను తెరపైకి తీసుకువచ్చి తెలుగు తమ్ముళ్లకు వేలాది రూపాయిల లబ్ధి చేకూర్చిందని చెప్పొచ్చు. మండలంలో 2000లకు పైగా ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేపట్టినట్లు రికార్డుల్లో పొందుపరచగా.. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 15 వందల వరకు నిధులు మంజూరు చేశారు. వీటిలో అనేక గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్వకుండానే జన్మభూమి కమిటీలు, అధికార పార్టీ నేతలు జేబులు నింపుకున్నారు.